క్లుప్తంగా

మాజీ సర్పంచ్ కుటుంబానికి భరోసా


బాధితురాలిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే ద్వారకనాథరెడ్డి

సోమల: మండలంలోని పెద్ద ఉప్పరపల్లె మాజీ సర్పంచ్ బషీర్ భార్య మొబీనా బ్రెయిన్ ట్యూమర్ వ్యాధితో బాధపడుతూ నడవలేని స్థితిలో ఉంది. శనివారం తంబళ్లపల్లె ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి వారి ఇంటికి వెళ్లి ఆమెను పరామర్శించారు. అండగా ఉంటానని, అధైర్య పడొద్దని, ఏ అవసరం వచ్చిన తనను సంప్రదించవచ్చని కుటుంబ సభ్యులకు భరోసా ఇచ్చారు. వైఎస్సార్‌సీపీ నేతలు పెద్దిరెడ్డి వేణుగోపాల్ రెడ్డి, నాగభూషణం రెడ్డి, మస్తాన్ వలీ, మహబుబ్‌బాషా పాల్గొన్నారు.

30న మండల సమావేశం

సోమల: ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో ఈ నెల 30న ఎంపీపీ ఈశ్వరయ్య అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరుగుతుందని ఎంపీడీఓ నాగరాజ ఓ ప్రకటనలో తెలిపారు. సమావేశంలో ప్రజాప్రతినిధులు పాల్గొనాలని, అన్ని శాఖల అధికారులు ప్రగతి నివేదికలతో హాజరు కావాలన్నారు.

క్రమశిక్షణతో చదువుకోవాలి


మాట్లాడుతున్న విజయలక్ష్మి

పులిచెర్ల(కల్లూరు): ప్రతి ఒక్కరూ క్రమశిక్షణతో బాగా చదవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ విజయలక్ష్మి తెలిపారు. పులిచెర్ల ఐసీడీఎస్ కార్యాలయంలో శనివారం బేటీబచావో–బేటీ పడావోపై కార్యక్రమం నిర్వహించారు. సూపర్‌వైజర్ మాట్లాడుతూ బాల్యవివాహాల నిర్మూలన, ఆహారం–ఆరోగ్యం, విద్య ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, సూపర్‌వైజర్ శిరీషా పాల్గొన్నారు.

అంగన్‌వాడీ పోస్టులకు ఇంటర్వ్యూలు


ఇంటర్వ్యూ చేస్తున్న ఆర్డీఓ శివయ్య

పలమనేరు: ఆర్డీవో కార్యాలయంలో డివిజన్ పరిధిలోని ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తు చేసుకున్న వారికి ఆర్డీవో శివయ్య శనివారం ఇంటర్వ్యూలు నిర్వహించారు. ప్రాజెక్టు డైరెక్టర్ నాగశైలజ మాట్లాడుతూ పలమనేరు ప్రాజెక్టులో ఆరు పోస్టులకు 14మంది, పుంగనూరు ప్రాజెక్టులో 7పోస్టులకు 13మంది, బంగారుపాళెంలో ఓ పోస్టుకు ఇద్దరు, చౌడేపల్లె ప్రాజెక్టులో ఐదు పోస్టులకు ఆరుగురు హాజరైనట్లు తెలిపారు. డీఎంఅండ్‌హెచ్‌వో కార్యాలయ అధికారులు, ఆయా ప్రాజెక్టుల సీడీపీవోలు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

పలమనేరు: తమ సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వ ఉద్యోగుల సంఘం నాయకులు తహసీల్దార్ కార్యాలయం ఎదుట శనివారం రిలే నిరాహార దీక్ష చేపట్టారు. సంఘ జిల్లా అధ్యక్షుడు శివయ్య, తాలూకా అధ్యక్షుడు జయశంకర్, రమణ, నజీర్ , సురేంద్రరెడ్డి, కాంట్రాక్టు ఉద్యోగులు పాల్గొన్నారు.

గడ్డివామి దగ్ధం



సదుం: రెడ్డివారిపల్లె పంచాయతీ పెదకంటివారిపల్లెలో శనివారం ప్రమాదవశాత్తు గడ్డివామి దగ్ధం అయ్యింది. స్థానికుల కథనం మేరకు రమణయ్యకు చెందిన గడ్డివామికి అకస్మాత్తుగా నిప్పంటుకుంది. మంటలు అదుపులోకి రాకపోవడంతో ఫైర్‌స్టేషన్‌కు సమాచారం ఇచ్చారు. సిబ్బంది అక్కడికి చేరుకుని మంటలను అదుపు చేశారు. ప్రమాదంలో మూడు వేల గడ్డికట్టలు కాలిపోయాయని, రూ.60 వేల నష్టం వాటిల్లినట్టు బాధితుడు తెలిపారు.

కోలారు ఎమ్మెల్యేను కలిసిన శ్రీవారి భక్తులు

పలమనేరు: తిరుమల శ్రీవారికి కూరగాయలను అందించే పలమనేరు ప్రాంతానికి చెందిన సేవకుల బృందం శనివారం కోలారు ఎమ్మెల్యే కొత్తూరు మంజునాథ్‌ను ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. తిరుమల అన్నదాన సత్రానికి ఆయన ఇప్పటికే పలు సేవలను అందించారు. కర్ణాటక నుంచి కూరగాయలను స్వామివారికి పంపేందుకు రూ.40 లక్షల వాహనాన్ని ఆలయానికి అందించారు. దీంతో శ్రీవారి భక్తులు ఆయనను కలసి భవిష్యత్తులోనూ స్వామివారి సేవకు తమకు సహకరించాలని కోరారు. ఆయన తప్పకుండా సాయం చేస్తానని చెప్పినట్టు శ్రీవారి సేవకులు కాబ్బల్లి రవీంద్రారెడ్డి, కిశోర్‌స్వామి, మోహన్ రెడ్డి, సోమశేఖర్ నాయుడు తెలిపారు.

కుప్పం అభివృద్ధిపై సీఎం ప్రత్యేక దృష్టి

- అభివృద్ధి పనులను వేగవంతం చేయండి
- ప్రజా సమస్యలను సత్వరమే పరిష్కరించాలి
- పనిచేయని అధికారులను ఉపేక్షించే ప్రసక్తే లేదు
- సమీక్షలో ఎమ్మెల్సీ భరత్


అధికారుల సమీక్షలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ భరత్

రామకుప్పం: కుప్పం నియోజకవర్గ అభివృద్ధిపై సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రత్యేక దృష్టి పెట్టారని, అలాంటి సమయంలో అధికారులు చురుగ్గా పని చేయాల్సిన అవసరం ఉందని, మండలంలో అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని అధికారులను ఎమ్మెల్సీ భరత్ ఆదేశించారు. శనివారం ఉదయం ఎంపీడీవో కార్యాలయ సమావేశ హాలులో అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజలు తెలిపిన సమస్యలను అధికారులు సత్వరమే పరిష్కరించాలన్నారు. సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చొరవ తీసుకోవాలని తెలిపారు. అధికారులు,ప్రజాప్రతినిధులు సమన్వయంతో అభివృద్ధి కార్యక్రమాలను సకాలంలో పూర్తి చేయాలని సూచించారు. సమావేశానికి హాజరైన ప్రజాప్రతినిధులు అధికారుల పనితీరుపై అసహనం వ్యక్తం చేస్తూ ఎమ్మెల్సీకి ఫిర్యాదు చేశారు. సమావేశాల్లో చర్చలు తప్ప సమస్యలను పరిష్కరించడంలో అధికారులు పూర్తిగా విఫలమవుతున్నారని సభ్యులు ముక్తకంఠంతో తెలిపారు. రామకుప్పంలోని జగనన్న లే అవుట్‌లో అర్హులకు ఇంటిపట్టాలను త్వరితగతిన పంపిణీ చేయాలని సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు మురళీకృష్ణ కోరారు. దీనిపై ఎమ్మెల్సీ భరత్ మాట్లాడుతూ అధికారులు పనితీరు మెరుగుపరుచుకోవాలని, పనిచేయని అధికారులను ఎటువంటి పరిస్థితుల్లోనూ ఉపేక్షించే ప్రసక్తే లేదని భరత్ హెచ్చరించారు. అనంతరం మండలంలో సేవావజ్ర ఒకరు,సేవారత్న అవార్డు అందుకున్న ఐదుగురు వలంటీర్లను భరత్ సన్మానించారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ విజలాపురం బాబురెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు నితిన్‌రెడ్డి, ఎంపీపీ సుబ్రమణ్యం, పార్టీ కో కన్వీనర్ చంద్రారెడ్డి, సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు మురళీకృష్ణ, తహసీల్దార్ మురళీ, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ రాధాకృష్ణ, మండల అధికారులు పాల్గొన్నారు.

వలంటీర్ల సేవా వారధులు


ప్రశంసాపత్రం అందజేస్తున్న ఎమ్మెల్సీ భరత్

రామకుప్పం: ప్రభుత్వానికి, ప్రజలకు వారధిగా ఉంటూ ప్రజా సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తున్న వలంటీర్ల సేవలు అభినందనీయమని ఎమ్మెల్సీ భరత్ అన్నారు. రామకుప్పం గ్రామ సచివాలయంలో శనివారం మధ్యాహ్నం వలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన భరత్ మాట్లాడుతూ ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ సంక్షేమ పథకాలను సకాలంలో ప్రజలకు అందిస్తున్న వలంటీర్ల సేవలను ప్రభుత్వం గుర్తించి సత్కరిస్తోందని తెలిపారు. సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆలోచనల నుంచి పుట్టిన సచివాలయ వ్యవస్థకు వలంటీర్లు పట్టుగొమ్ములుగా నిలుస్తున్నారని పేర్కొన్నారు. వలంటీర్ వ్యవస్థను అపహాస్యం చేస్తూ విమర్శలు చేసిన చంద్రబాబుకు వలంటీర్లు తమ పనితీరుతో తగిన గుణపాఠం నేర్పారని తెలిపారు. ఈ సందర్భంగా సేవామిత్ర అవార్డును అందుకున్న 36 మంది వలంటీర్లను సన్మానించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ విజలాపురం బాబురెడ్డి, స్థానిక సర్పంచ్ మురళీకృష్ణ, జెడ్పీటీసీ సభ్యుడు నితిన్‌రెడ్డి, ఎంపీపీ సుబ్రమణ్యం, వార్డు సభ్యులు జమీను ప్రసాద్, అబ్దుల్, నేతలు శంకర్, నారాయణస్వామి, చలపతి, పంచాయతీ కార్యదర్శి వెంకట రవిప్రసాద్, షాదిక్, సచివాలయ కార్యదర్శి యువరాజు పాల్గొన్నారు.

ప్రాజెక్టులు ఆపితే తగిన గుణపాఠం

'పడమటి నియోజకవర్గాలకు సాగునీరు–తాగునీరు కోసం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నిర్మిస్తున్న ముదివేడు, నేతిగుట్లపల్లె, ఆవులపల్లె ప్రాజెక్టులను అడ్డుకుంటే ప్రజలే తగిన గుణపాఠం చెబుతారు.ప్రాజెక్టులపై చంద్రబాబునాయుడు తప్పుడు కేసులు వేసి స్టే తీసుకు రావడం నీచాతినీచం. ఈ ప్రాజెక్టుల నిర్మాణంలో నష్టం ఎవరికీ లేదు. ఈ ప్రాంతంలో చంద్రబాబునాయుడుకు పొలాలు లేవు. అందుకనే ఆయన కేసులు వేసి రైతులకు కడుపు కొట్టాలని చూస్తున్నారు. ప్రాజెక్టు నిర్మిస్తే సంవత్సరంలో మూడు పంటలు పండిస్తాం'. సోమల మండలం ఆవులపల్లె ప్రాజెక్టు వద్ద సాధన సమితి ఆధ్వర్యంలో శనివారం జరిగిన సదస్సులో రైతులు టీడీపీ తీరుపై తీవ్రంగా మండిపడ్డారు. రైతుల మనోగతం వారి మాటల్లోనే.. - సోమల

ప్రాజెక్టు కట్టమన్నది వారే...



రాష్ట్ర మంత్రి డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి మండల పర్యటనలో ప్రాజెక్టు నిర్మించాలని ప్రస్తుతం కేసు దాఖలు చేసిన వారే అర్జీలు ఇచ్చారు. ఇప్పుడు పచ్చనాయకుల మాట విని కోర్టుకు వెళ్లి స్టేలు తెచ్చారు. దెయ్యాలు వేదాలు చదివినట్లు ఉంది వారి వ్యవహారం. పది వేల ఎకరాల సాగు భూమికి నీరు అందకుండా చేస్తే తెలుగుదేశం నాయకులకు వచ్చే లాభం ఏమిటో. ప్రాజెక్టుతో రైతులకు జరిగే మేలును గుర్తించాలి.
– కృష్ణమ నాయుడు, నాగిళ్లవారిపల్లె

పెద్దిరెడ్డికి రైతు కష్టాలు తెలుసు



మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రా రెడ్డి రైతు కుటుంబంలో జన్మించారు. ఆయనకు రైతుల కష్టాలు తెలుసు. 14 సంవత్సరాలు ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడు చేయని గొప్ప పనిని పెద్దిరెడ్డి చేస్తున్నారు. పడమటి నియోజకవర్గాలకు సాగునీరు–తాగునీరు కోసం 3 ప్రాజెక్ల నిర్మాణానికి నడుం బిగించారు. వైఎస్సార్‌సీపీకి పేరు రాకూడదని చంద్రబాబు కుట్రపన్ని ప్రాజెక్టులను అడ్డుకుంటే ప్రజలే తగిన గుణపాఠం నేర్పుతారు.
– లక్ష్మీసుధ, నాగిళ్లవారిపల్లె

స్టేలతో అభివృద్ధికి అడ్డు



నియోజకవర్గంలోని ఆరు మండలాల ప్రజలకు , రైతులకు సాగునీరు–తాగునీరు అందించేందుకు మంత్రి డాక్టర్ పెద్దిరెడ్డి ప్రాజెక్టుల నిర్మాణానికి పూనుకుంటే టీడీపీ నేతలు స్టేలు తెచ్చారు. అభివృద్ధికి సహకరించాలే తప్ప అడ్డుకోవడం తగదు. రైతులకు మేలు చేయకపోయినా ఫరవాలేదు. కీడు తలపెట్టడం దారుణం. ఇలా చేసే వారికి తగిన గుణపాఠం చెబుతాం. తెలుగుదేశం పార్టీకి భవిష్యత్తు లేదు.
–వేణుగోపాల్ రెడ్డి, పొలికిమాకులపల్లె

దమ్ముంటే ప్రాజెక్టు పరిశీలించండి



తెలుగుదేశం నాయకులకు దమ్ము ధైర్యం ఉంటే ప్రాజెక్టు వద్దకు వచ్చి.. ప్రజలతో చర్చకు రావాలి. ఆరు మండలాల రైతులకు ఉపయోగపడే కార్యక్రమం తెలుగుదేశం ప్రభుత్వంలో చంద్రబాబు ఒక్కటి కూడ చేయలేదు. ప్రస్తుతం చేస్తుంటే అడ్డుపడడం దారుణం. రైతులపై చంద్రబాబుకు ఎలాంటి ప్రేమ ఉందో ఇది తేటతెల్లం చేస్తోంది. వచ్చే ఎన్నికల్లో మీకు గుణపాఠం నేర్పుతాం.
–బాబు నాయుడు కొల్లాపూర్

వలంటీర్ల సేవలు స్ఫూర్తిదాయకం


బైరెడ్డిపల్లె: వలంటీర్ల సన్మాన కార్యక్రమంలో ఎంపీపీ మొగసాల రెడ్డెప్ప

బైరెడ్డిపల్లె: ప్రజలకు, ప్రభుత్వానికి వారధిగా వలంటీర్లు అందిస్తున్న సేవలు స్ఫూర్తిదాయకంగా నిలుస్తున్నాయని ఎంపీపీ మొగసాల రెడ్డెప్ప పేర్కొన్నారు. మండలంలోని కడపనత్తం సచివాలయంలో శనివారం వలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ సేవలను ప్రజలకు అందించడంలో వలంటీర్ల పాత్ర కీలకమన్నారు. కరోనా లాంటి క్లిష్ట సమయంలో ప్రాణాలకు తెగించి పని చేశారని కొనియాడారు. వలంటీర్ల వ్యవస్థ ద్వారా పారదర్శకంగా పథకాల లబ్ధి అందుతోందని తెలిపారు. దేశంలోని ఇతర రాష్ట్రాలు వలంటీర్ల వ్యవస్థ వైపు చూస్తున్నాయన్నారు. సన్మానంతో పాటు ఎంపీపీ మొగసాల రెడ్డెప్ప సొంత నిధులతో వలంటీర్లకు దుస్తులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ రాజేంద్రబాలాజీ, సర్పంచ్ రవిచంద్రబాబు, ఎంపీటీసీ సభ్యులు జగదీష్, సురేష్, వైఎస్సార్‌సీపీ నేతలు ప్రభాకర్‌రెడ్డి, ప్రభాకర్‌గౌడు, చతంబరం, రవికుమార్ పాల్గొన్నారు.


పలమనేరు: సన్మానం అందుకున్న వలంటీర్లు

వలంటీర్లకు సన్మానం

పలమనేరు: మండలంలోని సముద్రపల్లె సచివాలయంలో సేవామిత్ర, సేవా వజ్ర అవార్డులు అందుకున్న వారిని ప్రజాప్రతినిధులు, సచివాలయ అధికారులు సత్కరించారు. ఇదే స్ఫూర్తితో మరింతగా సేవలందించాలని వారు పేర్కొన్నారు. జెడ్పీటీసీ సభ్యురాలు మల్లిక రంగనాథం, సర్పంచ్ తిరుమలేష్ తదితరులు పాల్గొన్నారు.

క్షయ వ్యాధిపై అవగాహన

పలమనేరు: మండలంలో టీబీ వ్యాధిపై అవగాహన, వ్యాధిగ్రస్తుల గుర్తింపు ప్రక్రియను స్థానిక టీబీ యూనిట్ అధికారులు, సిబ్బంది నిర్వహిస్తున్నారు. శనివారం టి.వడ్డూరులో యూనిట్ అధికారులు విజయకుమార్, గౌతమి, జగదీశ్వరి కార్యక్రమంలో పాల్గొన్నారు. వ్యాధి లక్షణాలు, నివారణ చర్యలపై ప్రజలకు అవగాహన కల్పించారు. సర్పంచ్ బెంగళూరు మునస్వామి పాల్గొన్నారు.

అన్నం ప్యాకెట్ల వితరణ



కుప్పంరూరల్: తిరుపతి గంగమ్మ జాతర సజావుగా సాగితే అన్నదానం చేస్తామని రెస్కో చైర్మెన్ సెంథిల్ అభిమానులు అమ్మవారిని మొక్కుకున్నారు. జాతర సజావుగా సాగడంతో యువకులు శనివారం రైల్వే స్టేషన్, బస్టాండు ప్రాంతాల్లో అనాథలకు అన్నదానం చేశారు. వెజిటెబుల్ రైస్ ప్యాకెట్, వాటర్ బాటిల్ అందజేశారు. మణి, కందన్, లక్ష్మణ్, మనో, హేమంత్, సందీప్, అరుణ్ గుణ పాల్గొన్నారు.

భజన కళాకారులకు వస్త్రాలు



పలమనేరు : మున్సిపల్ పరిధి బోడిరెడ్డిపల్లె భజన కళాకారులకు ప్రోత్సాహకంగా పట్టణానికి చెందిన శ్రీపురం సీతారామయ్య శనివారం వస్త్రాలను అందజేశారు. కళాకారులను ఆదుకోవాలనే తలంపుతో ఈ చిరుసాయాన్ని చేసినట్టు ఆయ న తెలిపారు.

త్వరితగతిన దళితుల సమస్యల పరిష్కారం


పాల్గొన్న ఎస్‌ఐ, తహసీల్దార్, ఎంపీడీఓ

శాంతిపురం: దళితుల సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తామని తహసీల్దార్ లోకేశ్వరరావు తెలిపారు. శనివారం మండల సచివాలయంలో తహసీల్దార్ ఆధ్వర్యంలో ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సమావేశం జరిగింది. ఎంపీడీఓ హేమమాలిని, ఎస్ఐ మునస్వామి, వ్యవసాయాధికా అప్పోజీ పాల్గొన్నారు. దళిత నాయకులు మాట్లాడుతూ గత సమావేశాల్లో లేవనెత్తిన సమస్యలు ఇంకా పరిష్కారం కాలేదని తెలిపారు. దళిత కాలనీల్లో మురుగు కాలువలు, సిమెంటు రోడ్లు నిర్మాణం పనులు పూర్తి చేయాలని కోరారు. మానిటరింగ్ కమిటీ సమావేశానికి హాజరు కాని అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అధికారులు మాట్లాడుతూ ప్రాధాన్యత క్రమంలో అన్ని సమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు. సమావేశంలో దళిత సంఘాల నాయకులు దేవరాజులు, వీరభద్రప్ప, కుమార్, బాలు, రాజు, పాపన్న, రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.


సెల్‌టవర్ ఎక్కి నిరసన

శనివారం ఉదయం 11కు జరగాల్సిన మానిటరింగ్ సమావేశాన్ని జిల్లా కలెక్టర్ పర్యటన నేపథ్యంలో తహసీల్దార్ రద్దు చేశారు. దీంతో దళిత సంఘాల నాయకులు సెల్ టవర్ ఎక్కి కొందరు, మండల సచివాలయం ఎదుట కొందరు బైఠాయించి నిరసన తెలిపారు. మధ్యాహ్నం 1.30 గంటలకు సమావేశం నిర్వహిస్తామని తహసీల్దార్ ప్రకటించడంతో నిరసనను విరమించారు.

వేలం ఆదాయం రూ.1.83 లక్షలు

పుంగనూరు: మద్యం అక్రమ కేసులో పట్టుబడిన వాహనాల వేలం ద్వారా రూ.1.83 లక్షల ఆదాయం లభించినట్లు ఎస్ఈబీ సీఐ సీతారామిరెడ్డి తెలిపారు. పట్టణంలోని ఎస్ఈబీ పోలీస్‌స్టేషన్ ఆవరణలో శనివారం ట్రైనీ ఏఈఎస్ ఉహశ్రీ ఆధ్వర్యంలో ఏడు వాహనాలను వేలం వేశారు

రామకుప్పంలో రూ.1.02 లక్షల ఆదాయం


రామకుప్పం : వేలం నిర్వహిస్తున్న అయేషా బేగం

రామకుప్పం: మండల పరిధిలో ఎక్సైజ్ దాడుల్లో పట్టుబడిన వాహనాలను శనివారం పోలీస్‌స్టేషను ఆవరణలో ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ అయేషా బేగం ఆధ్వర్యంలో వేలం నిర్వహించారు. 6 ద్విచక్ర వాహనాలు, 5 స్క్రాప్ ద్విచక్ర వాహనాలకు వేలం నిర్వహించగా రూ.1.02 లక్షల ఆదాయం వచ్చినట్లు ఆమె తెలి పారు. సెబ్ సీఐ కిషోర్‌కుమార్, ఎస్ఐ కృష్ణయ్య పాల్గొన్నారు.

క్రీడా విజేతలకు బహుమతుల ప్రదానం


బహుమతులు అందజేస్తున్న నిర్వాహకులు

సదుం: పరివర్తన సేవా సంస్థ, నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో శనివారం ఊటుపల్లె పంచాయతీ శ్రీఅభయాంజనేయస్వామి ఆలయ సమీపంలోని మైదానంలో పలు క్రీడా పోటీలు నిర్వహించారు. సమీప గ్రామాల్లోని యువత క్రీడల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. ప్రతిభ చూపిన వారికి సంస్థ ఆధ్వర్యంలో బహుమతులు, సర్టిఫికెట్లు అందజేశారు. వైఎస్సార్ సీపీ నేత నారాయణరెడ్డి, సంస్థ అధ్యక్షుడు అమరనాథ్, సచివాలయ కార్యదర్శి చాణక్య, విశ్వనాథ్, మురళీకృష్ణ, భరత్, యుగంధర్ తదితరులు పాల్గొన్నారు.

బైకును ఢీకొన్న కారు

గంగవరం: పలమనేరు–బెంగళూరు జాతీయ రహదారిలో బాలాజీ భవన్ సమీపంలో కారు ఢీకొన్న ప్రమాదంలో ద్విచక్ర వాహనదారుడు తీవ్రంగా గాయపడ్డాడు. మండలంలోని కంచనపల్లె గ్రామానికి చెందిన వేదాద్రి(31) పెద్ద ఉగిణి గ్రామంలో అత్తింటి నుంచి బైక్‌పై స్వ గ్రామానికి వెళ్తున్నాడు. రహదారిలోని బాలాజీ భవన్ సమీపంలో ద్విచక్ర వాహనాన్ని రాంగ్ రూట్‌లో వస్తున్న కారు ఢీకొంది. ఈ ఘటనలో వేదాద్రి తీవ్రంగా గాయపడ్డాడు. ప్రమాదం జరిగిన వెంటనే కారును అక్కడే వదలి డ్రైవర్ పరారయ్యాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం 108లో పల మనేరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కర్ణాటక మద్యం పట్టివేత


నిందితుడి అరెస్టు చూపుతున్న పోలీసులు

రామకుప్పం: రామకుప్పం వైఎస్సార్ సర్కిల్‌లో శనివారం కర్ణాటక మద్యం అక్రమంగా తరలిస్తున్న వ్యక్తిని పట్టుకుని, 192 టెట్రా ప్యాకెట్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వీ.కోట మండలానికి చెందిన నవీన్(23) రాజుపేట రోడ్డు నుంచి రామకుప్పం మీదుగా ద్విచక్ర వాహనంలో మద్యం ప్యాకెట్లను తరలిస్తున్నాడు. ఈ సమయంలో రామకుప్పం వైఎస్సార్ సర్కిల్‌లో ఎస్ఐ కృష్ణయ్య వాహనాలను తనిఖీ చేస్తున్నారు. ఈ వాహనాన్ని ఆపి తనిఖీ చేయగా మద్యం ప్యాకెట్లు ఉన్నాయి. వాహనం, మద్యం స్వాధీనం చేసుకుని, అతన్ని అరెస్టు చేశారు. కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ కృష్ణయ్య తెలిపారు.

వాల్మీకి విద్యార్థులకు నేడు పురస్కారాలు

పలమనేరు: ఉమ్మడి చిత్తూరు జిల్లాలో టెన్త్, ఇంటర్ పరీక్షల్లో మంచి మార్కులు సాధించిన వాల్మీకి కుల విద్యార్థులకు పలమనేరు శ్రీవాణి కళాశాల ఆవరణలో ఆదివారం పురస్కారాలు అందజేయనున్నట్లు సంఘ నాయకులు ఎల్. భాస్కర్ శనివారం తెలిపారు. స్థానిక వాల్మీకి సంఘం కార్యాలయంలో శనివారం సంఘ నాయకులు విలేకరులతో మాట్లాడుతూ ముఖ్య అతిథులుగా హోంగార్డ్స్ ఎస్పీ మహేష్‌కుమార్, డాక్టర్ శివ హాజరవుతారన్నారు.

సకాలంలో వేరుశనగ విత్తనాల పంపిణీ


పుంగనూరు: బోడేవారిపల్లెలో విత్తనాలు పంపిణీ చేస్తున్న ఎంపీపీ భాస్కర్‌రెడ్డి


పెద్దపంజాణి: విత్తనాలను పంపిణీ చేస్తున్న ఎంపీపీ రెడ్డెప్ప

పుంగనూరు: మండలంలోని రైతులందరికీ సకాలంలో వేరుశెనగ విత్తనాలను పంపిణీ చేయనున్నట్లు ఎంపీపీ అక్కిసాని భాస్కర్‌రెడ్డి తెలిపారు. శనివారం మండలంలోని బోడేవారిపల్లె ఆర్‌బీకేలో విత్తనాలు పంపిణీని ఏవో రాజేష్ ఆధ్వర్యంలో ఎంపీపీ, ఏఎంసీ చైర్మన్ అమరనాథరెడ్డి ప్రారంభించారు. ఎంపీపీ మాట్లాడుతూ మండలానికి 2,225 క్వింటాళ్ల విత్తనాలు అందినట్లు తెలిపారు. ఇంకా 200 క్వింటాళ్లు అవసరమని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి విన్నవించామని తెలిపారు. ఒకొక్క రైతుకు ఒక బస్తా ఇస్తున్నట్లు పేర్కొన్నారు. ఎక్కువ సాగు చేసే వారికి 3 బస్తాలు మాత్రమే ఇవ్వనున్నట్లు తెలిపారు. వీటితో పాటు జీలుగా 20 క్వింటళ్లు, జనుము 50 క్వింటాళ్లు అందుబాటులో ఉన్నట్లు పేర్కొన్నారు. రిజిస్ట్రేషన్ల ప్రక్రియ పూర్తికాగానే ఈనెల 29 నుంచి 21 ఆర్‌బీకే కేంద్రాల్లో వీటిని పంపిణీ చేస్తామన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు జయరామిరెడ్డి, రామకృష్ణారెడ్డి, జయరామిరెడ్డి, రమణ తదితరులు పాల్గొన్నారు.

రైతుల అభ్యున్నతే ధ్యేయం

పెద్దపంజాణి: రైతుల అభ్యున్నతే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందని ఎంపీపీ ఎస్. రెడ్డెప్ప తెలిపారు. మండల కేంద్రంలోని వ్యవసాయ కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బాగారెడ్డితో కలసి శనివారం రైతులకు వేరుశనగ విత్తనాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో విత్తన వేరుశనగ కావాలంటే మండల కేంద్రానికి వెళ్లి రెండు మూడు రోజుల పాటు అవస్థలు పడాల్సిన పరిస్థితి ఉండేదన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఆర్‌బీకేలు ఏర్పాటు చేసి రైతులకు సొంత గ్రామంలోనే విత్తనాలు, ఎరువులు అందజేస్తున్నటు సింగిల్‌విండో చైర్మన్ ఓబుల్ రెడ్డి, వైస్ ఎంపీపీ జీడీ బాబు, రైతు సలహా మండలి చైర్మన్ వెంకటరమణారెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు శ్రీనివాసులు, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి తమ్మిరెడ్డి, ఏఎంసీ డైరెక్టర్ సురేష్, రెడ్డిబాషా, ఏఓ రఖీబా, సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

రేపటి నుంచి కుప్పంలో విత్తనాల పంపిణీ

కుప్పం: మండల పరిధిలో సోమవారం నుంచి వేరుశనగ విత్తనాలను పంపిణీ చేయనున్నట్లు వ్యవసాయాధికారి అమృతవల్లి తెలిపారు. శనివారం ఆమె మాట్లాడుతూ మొదటి విడతగా 11 ఆర్‌బీకే కేంద్రాల్లో చేయనున్నట్లు పేర్కొన్నారు. బస్తా విత్తనాలు సబ్సిడీపోను రూ. 1674కు విక్రయిం చను న్నట్లు పేర్కొన్నారు. చందం, గెరిగశేపల్లె, కొత్తపల్లె, కంగుంది–1, కం గుంది–2, చెక్కనత్తం, దాసేగానూరు, మాల్లానూరు–1, మల్లానూరు–2, అడవిబూదుగురు, వానగుట్టపల్లె రైతు భరోసా కేంద్రాల్లో వేరుశనగ విత్తనాలు పంపిణీ చేయనున్నట్లు ఆమె చెప్పారు. మిగిలిన కేంద్రాల పరిధిలోని రైతులు విత్తనాల కోసం పేర్లు నమోదు చేసుకోవాలని వ్యవసాయాధికారి సూచించారు.

ఘనంగా పలమనేరు ఉరుసు


ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

పలమనేరు : పట్టణంలోని దండపల్లి రోడ్డు వద్ద వెలసిన హజరత్ గంజ్ షాహిద్ షావలి జలాలుద్దీన్ బాబా 75వ ఉరుసు మహోత్సవం శనివారం ఘనంగా జరిగింది. ఇందులో భాగంగా శుక్రవారం రాత్రి గంధం, ఖవ్వాలీ కార్యక్రమాలు జరిగాయి. పెద్దసంఖ్యలో పాల్గొన్న భక్తులు హజరత్ సమాధికి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో నిర్వాహకులు బీడీ మస్తాన్, సర్వర్, హైదర్, ఖదీర్, ఎజాజ్, అస్లాం పాల్గొన్నారు.

విలువలతో వ్యక్తిత్వ వికాసం


ప్రశంసాపత్రాలు అందుకున్న చిన్నారులు

పలమనేరు : చిన్నతనం నుంచి విలువలపై అవగాహన పెంచుకుని పాటించడం ద్వారా వ్యక్తిత్వ వికాసం అలవడుతుందని తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి అధ్యక్షుడు తులసీనాథం నాయుడు పేర్కొన్నారు. సమితి ఆధ్వర్యంలో స్థానిక కళాక్షేత్రంలో ఈనెల 1 నుంచి విలువలపై విద్యార్థులకు ప్రారంభించిన వేసవి శిక్షణ శనివారంతో ముగిసింది. ఆయన మాట్లాడుతూ శిక్షణలో పిల్లలకు నీతి కథలు, పద్యాలు, సూక్తులు, సంభాషణలు, ఆటల ద్వారా నీతి, విలువలను నేర్పినట్టు తెలిపారు. శిక్షణలో నేర్చుకున్న అంశాలను పిల్లలు పాటలు, సంభాషణల ద్వారా వినిపించడంతో తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేశారు. విద్యార్థులకు ప్రశంసా పత్రాలు, బహుమతులను అందజేశారు. సమితి కార్యదర్శి పుష్ప, జే శ్రీరామచంద్రమూర్తి, చంద్రశేఖరయ్య, శివశంకర్‌రెడ్డి, సుదర్శనాచారి, గురుమూర్తి, సీతారామయ్య పాల్గొన్నారు.

పకడ్బందీగా సిటిజన్ సర్వే


జరుగు గ్రామంలో సర్వే చేస్తున్న సిబ్బంది

కుప్పంరూరల్: కుప్పం మండలంలో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న సిటిజన్ సర్వే వేగంగా జరుగుతోంది. సచివాలయ సిబ్బంది, వలంటీర్లు ప్రతి ఇంటికీ వెళ్లి సంక్షేమ పథకాలు సక్రమంగా అందుతున్నాయా, ఏవైనా ఇబ్బందులు ఉన్నాయా అని తెలుసుకుంటున్నారు. వలంటీర్ల పనితీరు, సచివాలయంలో గౌరవం దక్కుతుందా... ఇబ్బందులు ఉన్నాయా అంటూ అభిప్రాయ సేకరణ చేస్తున్నారు. ఇంటింటికీ వెళ్లి ప్రతి లబ్ధిదారుడి ఫొటో తీసి డ్యాష్ బోర్డులో అప్‌లోడ్ చేస్తున్నారు.